
ప్రజాశక్తి
శనివారం 3 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం



మల్లి గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గురుకుల పాఠశాలలో బ్యాక్ లాగ్ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర పివిటిజి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో మూడో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు 123 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 4న లాటరీ ద్వారా మల్లి గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు



గుమ్మలక్ష్మీపురంలో బంద్‌తో మూతపడ్డ దుకాణాలు

మన్యం బంద్ విజయవంతం

- నిలిచిన వాహనాలు
- మూతపడిన వర్తక, వాణిజ్య సముదాయాలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, జీవో3ను పునరుద్దరిచాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం జిల్లాలో శుక్రవారం చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, సాలూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో బంద్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో వర్తక వాణిజ్య సముదాయాలు, హెూటళ్లు మూతపడ్డాయి. ప్రైవేటు వాహనాల యజమానులు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆటోలు ట్రక్కర్లు, బస్సుల రాకపోకలు పిలిపివేసి బంద్‌కు సహకరించారు. రిక్షా, కళాసీ కార్మికులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. బంద్ కారణంగా జనసంచారం లేకపోవడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. జిఒ 3కు ఆర్డినెన్స్ జారీ చేయాలని, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ నినాదాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో 16వేల 42 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే జిఒ 3కు చట్టబద్ధత కల్పించకుండా నోటిఫికేషన్ జారీ చేయడంతో ఏజెన్సీ ప్రాంతంలో గల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జిఒ 3 వల్ల గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు వచ్చేవని, ఈ జిఒ రద్దు చేయడంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాటకు కూటమి ప్రభుత్వం జిఒ 3ను పునరుద్ధరించి ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఐటిడిఎల పరిధిలో స్పెషల్ డీఎస్సి ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు ఎం.సన్యాసిరావు, పి.మోహన్ రావు, బి.ఆడితు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పత్తిక ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

కురుపాం : ఆదివాసీలకు కోసం ఐటిడిఎ పరిధిలో మెగా డీఎస్సీని విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏజెన్సీ డీఎస్సీ రాష్ట్ర సాధన కమిటీ పిలుపు మేరకు మన్యం బంద్ కురుపాంలో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజనులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.తిరుపతిరావు, గిరిజన నిరుద్యోగ యువత పాల్గొన్నారు .

కొమరాడ : గిరిజన సంఘం స్పెషల్ డీఎస్సీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న మన్యం బంద్ కొమరాడలో విజయవంతమైంది. సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన పలు దుకాణాలను నాయకులు మూయించారు. అనంతరం కొమరాడ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన స్పెషల్ డిఎస్‌సికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ మన్యం బంద్‌ను ఉద్దేశించి గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు, ఊయిక వెంకటేష్, లక్ష్మయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన యువకులు సురేష్, రామారావు, దినేష్, బాలగోవిందు, కుమార్, కిరణ్, ప్రవీణ్, కృష్ణ, సూర్యారావు, రైతులు సూర్యనారాయణ, అప్పారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

పార్వతీపురం : ఆదివాసీలకు ప్రత్యేక డీస్సీ, ఉద్యోగ అవకాశాల్లో వంద శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన రాష్ట్ర కమిటీ మన్యం బంద్ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద గిరిజన, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ అమలు చేయడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 94శాతం నివాసం ఉన్న గిరిజనులకు 6 శాతం ఉద్యోగాలు, 6 శాతం నివాసం ఉన్న గిరిజనేతరులకు 94 శాతం ఉద్యోగాలు కేటాయించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జిఒ 3 ఆదివాసీ యువతకు 100శాతం ఉద్యోగ కల్పన హక్కు కల్పించిందని, ఈ జిఒ రద్దుతో ఆదివాసీల ఉద్యోగ అవకాశాలందక తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇవ్వాలని, నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మెగా డీఎస్సి నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు పి.రాము, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, రైతు సంఘం నాయకులు బంటు దాసు, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో రాస్తారోకో చేస్తున్న గిరిజనసంఘం నాయకులు

సాలూరు : ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమల్లో ఆదివాసీలకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ, వెంటనే ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి ద్వారా నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేస్తూ మన్యం బంద్‌కు సాలూరు గిరిజన ఉద్యోగుల జెఎసి మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా సాలూరు పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం జెఎసి నాయకులు కె.జానకీరామ్, పి.ప్రభాకర్ రావు మాట్లాడారు. గిరిజన వ్యతిరేక నిర్ణయాలు ప్రభుత్వం నిలిపివేయకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజలను కదిలించి పోరాటాలకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం జెఎసి నాయకులు ఎస్.రాము, ఎల్.వెంకటరావు, ఎస్.సన్యాసిరావు, పి.వెంకన్న దొర, ఎ.లక్ష్మణ, వి.రాజారావు, ఎ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : రాష్ట్ర మన్యం బందు సందర్భంగా మండలంలోని మామిడిపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు జిఒ 3ను పునరుద్ధరించి, ఏజెన్సీ ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకాలు చేపట్టాలని, లేకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూనేటి చినబాబు, తాడంగి గాసి, సన్యాసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మన్యం బందు ఆదివాసి గిరిజన సంఘం చేపట్టిన సందర్భంగా పాచిపెంట లో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు భూతాల శాంతి కుమార్, మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బంద్ జరిగింది. అలాగే బొర్రమామిడి పంచాయతీ పూతిక వలస వద్ద ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.రామారావు, పోయి గంగరాజు, చిన్నారావు ఆధ్వర్యంలో జరిగింది.

గిరిజన సంఘాల ఆందోళనకు వైసిపి మద్దతు

పార్వతీపురం: ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘాలు చేపడుతున్న ఆందోళనకు వైసిపి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి ఫోన్‌లో 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన యువతను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ గిరిజన యువకుల పాలిట దగా డీఎస్సీగా మారిందన్నారు. అనేక ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలిందని చెప్పారు. ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు లు జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, స్పెషల్ డీఎస్సీపై హామీ లిచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆ హామీల అమలు ప్రస్తావన లేదన్నారు. గిరిజనులను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని రాజన్నదొర చెప్పారు.



పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, ప్రజాసంఘాల నాయకులు



కురుపాంలో రాస్తారోకో చేస్తున్న గిరిజనసంఘం నాయకులు



కొమరాడలో నిరసన తెలుపుతున్న గిరిజనసంఘం నాయకులు, యువకులు

దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దు

- హౌసింగ్ పై మండల ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలి
- పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని 0-6 ఏళ్ల లోపు పిల్లలకు జారీ చేయనున్న బర్త్ సర్టిఫికేట్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దని సంయుక్త కలెక్టర్ మండల అదికారులను ఆదేశించారు. శుక్రవారం నాటికి దరఖాస్తుల స్వీకరణ పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ సీతంపేట, బలిజిపేట, భామిని, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పాలకొండ, పార్వతీపురం, సాలూరు అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు దరఖాస్తులు స్వీకరించకపోవడంపై ఆమె ఆరా తీశారు. శనివారం ఉదయం నాటికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని, లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. బర్త్ సర్టిఫికేట్లు మంజూరైతే, ఈ నెలాఖరులోగా పిల్లలకు ఆధార్ కార్డులు వస్తాయని, కావున దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పలు అంశాలపై ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నరేగా పనుల్లో కూడా అధికారులు మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సగటు దినసరి వేతనం రూ.300 ఉండేలా అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఫారంపాండ్లు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని, కావున దీనిపై దృష్టి సారించాలన్నారు. ఈ ఏడాది నరేగాలో 5వేల ఎకరాల్లో కొబ్బరిని పెంచేందుకు ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని, వాటికి సంబంధించిన అంచనాలను ఈ నెల 9లోగా అందజేయాలని అన్నారు. జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపేలా మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జెసి ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రతి రోజు గృహ నిర్మాణాల ప్రగతి ఉండాలని, లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే దరఖాస్తులను జిల్లా అధికారులు ఎప్పటికపుడు పరిశీలించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, సిపిఒ పి.వీర్రాజు, గృహ నిర్మాణ సంస్థ, డీఆర్డీఏ, డ్వామా, పీడీలు డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, పంచాయతీ అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, డా. ఎన్.మన్మధరావు, టి.కొండలరావు, మునిసిపల్ కమిషనర్లు, మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

ఐదో రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం


వైద్య, ఆరోగ్యశాఖ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ల సమస్యలపై నిర్వహిస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరుకున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఒంటి కాళ్లపై నిల్చొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, యుటిఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ మురళీమోహన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా నాయకులు జగదీష్ మాట్లాడారు. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 23శాతం వేతనం పెంచాలని, సబ్ సెంటర్ల అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా తమ ఆందోళన నిర్వహిస్తున్నప్పటికీ కనీసం నాయకత్వంతో చర్చించి సమస్యలు పరిష్కరించడానికి కూడా ప్రభుత్వం సిద్ధపడడం లేదని విమర్శించారు. ఈ వ్యవస్థ ఏర్పడి ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వీరి సర్వీస్ రెగ్యులర్ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదని విమర్శించారు. తక్షణమే హెల్త్ సెంటర్ల బకాయి అద్దెలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వ అధికారులు, మంత్రి చర్చలు జరిపి వీరి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ ఆందోళన ఉధృతం చేస్తామని, ఈ ఆందోళనకు రాష్ట్రంలోని అన్ని ప్రజాసంఘాల మద్దతు కూడగడతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాకబ్, రాజేశ్వరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.18,500 వేతనం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద 102 సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న కెప్టెన్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 యూనియన్ ఆధ్వర్యాన గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా తల్లీబిడ్డ ఎక్స్ప్రెస్ 102 ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శోభికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, యూనియన్ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్లకు గత తొమ్మిదేళ్ల నుంచి రూ.7870 జీతం మాత్రమే ఇస్తున్నారన్నారు. ఒకపక్క నిత్యవసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నా 9 ఏళ్ల నుండి జీతం పెంచకపోవడం అన్యాయమని అన్నారు. వీరికి ఎస్‌ఎపిడబ్ల్యు, హెచ్‌ఆర్‌పిడబ్ల్యు లాంటి పనులు అప్పజెప్పి పనిభారం పెంచారని చెప్పారు. వారి కాంట్రాక్ట్ మార్చి 31తో ముగిసిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం, కాంట్రాక్టర్ ఆలోచించి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న వారికి ఇఎస్ఐ, పిఎఫ్ వాటా యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వీక్లీ ఆఫ్‌లు, పండగ, జాతీయ సెలవులు అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్ ఇవ్వాలని, సెల్ఫోన్ రీఛార్జ్ చేయించాలని డిమాండ్ చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు అదనంగా చేస్తున్న హై రిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్ సివిల్ ఎనిమిక్ ప్రెగ్నెంట్ ఉమెన్స్ సేవలకు అదనపు వేతనం చెల్లించాలని కోరారు. రూ.18500 జీతాలు పెంచాలని, ఆరోగ్య భీమా, ఎక్స్‌గ్రేషియో, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. వాహనాలకు మరమ్మతులు చేయించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేణు, భాస్కరరావు, మోహన్‌రావు, సన్యాసి, లోకేష్, వెంకటనాయుడు, వాసు, తిరుపతిరావు, సంతోష్ కుమార్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న 102 ఉద్యోగులు

వర్ష బీభత్సం

- నేలకొరిగిన వృక్షాలు
- అంధకారంలో వీరఘట్టం



వీరఘట్టం-పాలకొండ ప్రధాన రహదారిపై నేలకొరిగిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గురువారం రాత్రి భయంకరమైన ఉరుములు, మెరుపులతో బీభత్సమైన వర్షం కురవడంతో ఎక్కడికి అక్కడే భారీ వృక్షాలు నేలకొరకడంతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో రాత్రంతా అంధకారం లోనే ప్రజలు కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వృద్ధులు, చంటి పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విక్రంపురం, కంబర తదితర గ్రామాల్లో అరటి, పామాయిల్ తోటలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వచ్చే తరుణంలో వర్షం కారణంగా నాశనమైపోవడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాని దుస్థితి ఏర్పడిందని, ఆర్థికంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు రైతుల ఆరోపిస్తున్నారు. వీరఘట్టం -పాలకొండ ప్రధాన రహదారిలో ఎం.రాజపురం, రేగులపాడు, తూడి, నడుకూరు, గ్రామాల సమీపంలో భారీవృక్షాలు రహదారిపై అడ్డంగా పడిపోవడంతో స్థానిక ఎస్సై జి కళాధర్, సిబ్బంది అక్కడికి చేరుకొని జెసిబి సహాయంతో రహదారిపై పడిన వృక్షాలను తొలగించారు. రహదారిపై చెట్లు పడిపోవడం వల్ల ఎక్కడ వాహనం అక్కడే నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారిపై ఉన్న చెట్లను తొలగించడంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. ప్రాణహాని జరగకపోవడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

కనిపించని ఆర్ అండ్ బి అధికారులు

మండలంలోని రేగులపాడు, ఎం.రాజపురం, తూడి, నడుకూరు గ్రామాల సమీపాన భారీ వృక్షాలు ప్రధాన రహదారిపై నేలకొరిగినప్పటికీ కనీసం పడిన చెట్లను పరిరక్షించేందుకైనా ఆర్ అండ్ బి అధికారుల జాడ కనిపించలేదని, స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. నడుకూరు సమీపాన పాల ఉత్పత్తి కేంద్రం వద్ద చెట్టు రోడ్డుపై పడి ఉన్నప్పటికీ ఇప్పటికీ వాటిని తొలగించలేదు. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో విస్తృతంగా వర్షాలు

పార్వతీపురం రూరల్ : మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలు ప్రజలకు ఎంతగానో ఊరట ఇచ్చాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో మూగజీవాలు దాహార్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలో ఈ ఏడాది విస్తృతంగా రబీ పంటగా వరి వేసిన రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ సాయంత్రం చినుకులు కురిసి ప్రజలకు స్వాంతన చేకూర్చాయి. గురువారం రాత్రి జిల్లాలోని 15 మండలాల్లో 474.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లా సగటు 31.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. అధికారుల అందించిన వివరాల ప్రకారం మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి.

వీరఘట్టం 55.2 మిల్లీమీటర్లు, సీతంపేట 24.6, భామిని 33.8, పాలకొండ 45.6, కొమరాడ 37.4, గుమ్మలక్ష్మీపురం 29.4, కురుపాం 49.2, జియ్యమ్మవలస 42.2, గరుగుబిల్లి 22.8, పార్వతీపురం 56.8, మక్కువ 25.4, సీతానగరం 5.8, బలిజిపేట 18.4, సాలూరు 13.2 పాచిపెంట 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పార్వతీపురంలో 56.8, అత్యల్పం సీతానగరం 5.2 నమోదైనట్లు అధికారులు వివరాలు అందజేశారు. రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో విస్తృతంగా వర్షాలు ఉంటాయని, అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు పొలాలకు వెళ్లేవారు రైతులు ఉపాధి వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.



పార్వతీపురంలోని చెరువు కుంటల్లో చేరిన వర్షం నీరు

బతుకుతెరువుకు వెళ్లి... విగత జీవిగా మారి

ప్రజాశక్తి - కురుపాం



బతుకుతెరువు కోసం వెళ్లేన గిరిజన యువకుడు విగత జీవిగా మారిన సంఘటన మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ డంగులుగూడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారం ప్రకారం బిడ్డిక ప్రశాంత (23) బతుకు తెరువు కోసం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం రొయ్యల చెరువులోకి పనిచేయడానికి వెళ్లి జీవనం సాగిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడని తండ్రి బిడ్డక సోమయ్య తల్లి గుడిమి తెలిపారు. తండ్రి సోమయ్య మరణించడంతో తల్లికి నెలనెలా ఇంటికి డబ్బులు పంపిస్తూ పోషిస్తున్న నేపథ్యంలో గురువారం పని నిమిత్తం రొయ్యలు చెరువు వద్దకు వెళ్లి విద్యుత్ షాకుతో మృతి చెందాడని ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో కొడుకు మరణ వార్త విన్న ఆ తల్లి కన్నీరు మున్నీరవుతూ అందొచ్చిన కొడుకు ఇలా అర్థాం తరం గా చనిపోవ డంతో తాను అనాధగా మిగిలానని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తాను అనాధనయ్యాయని కన్నీరు మున్నీరవుతుంది. కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి స్పందించి తూర్పుగోదావరిలో గల గోపాలపురం ఎమ్మెల్యేతో మాట్లాడి మృతదేహాన్ని యువకుడి స్వగ్రామానికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేయగా, శుక్రవారం రాత్రికి మృతి దేహం ఇంటికి చేరుకుంది.

ఇదే కాకుండా గత కొద్ది రోజులుగా గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీకి చెందిన తుమ్మిగూడకు కిరణ్ (24) ఉపాధి కోసం కృష్ణా జిల్లాలోని రొయ్యల చెరువులో పనికి వెళ్లి ఆయన కూడా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. ఇవే కాకుండా గతంలో ఇలా ఎన్నో సంఘటనలు జరిగి మరణించిన సంఘటనలో ఎన్నో ఉన్నాయని, దీనికి కారణం స్థానికంగా గిరిజన యువతకు ఉపాధి అవకాశాల్లేక వేరే జిల్లాలకు బతుకు తెరువుకెళ్ళి ఎందరో మృత్యువాత పడుతున్నారని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఐటిడిఎ ద్వారా గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి గిరిజనులను ఆదుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్-డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. వీరి విన్నపాలను విన్న ఎస్పీ వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం వున్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయం సంబంధిత ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా మున్సిపల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గ సంఘ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా జి.వినయ్‌కుమార్, ఉప అధ్యక్షులుగా కె. పుష్పలత, కోశాధికారిగా బి.హేమలత, కార్యదర్శిగా కె.త్రినాథ, ఉప కార్యదర్శిగా బి.ఈశ్వరరావు, రెండవ ఉప కార్యదర్శిగా డి.సురేష్, సహాయకులుగా జి.లక్ష్మి డి.రుబెన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా టి.అశోక్, వివిలి వీరి నాయుడు, ఎ.అప్పారావు, పి.శ్యామల ఎన్నికయ్యారు.

రవికి డాక్టరేట్

ప్రజాశక్తి -సీతంపేట

సీతంపేట గిరిజన మారుమూల ప్రాంతం పెద్ద పల్లకి గ్రామం నుంచి ఎంటెక్, పిహెచ్‌డి చేసిన గేదెల రవికి డాక్టరేట్ లభించింది. గౌహతి ఐఐటిలో పిహెచ్‌డి చేసిన ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది. ఎంటెక్ చేస్తున్న సమయంలో, ప్రొఫెసర్ రంజన్ తములి మార్గదర్శకత్వంలో ఎం. టెక్ ప్రాజెక్ట్, తరువాత ప్రభుత్వ డివిజనల్ ప్రాజెక్ట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పని చేసే అవకాశం లభించింది. ప్రస్తుతం, రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయంలో వైద్యక బయోసైన్సెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్‌గా ఆయన సేవలు అందిస్తున్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి- కొమరాడ

రైల్వే లైన్ క్రాసింగుల వద్ద ఏర్పాటు చేసిన రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడలో చిన్న కేర్జల తదితర గ్రామానికి వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిల్వ ఉన్న నీటి వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం గుమడ రైల్వే మాస్టర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామకష్ణ, నూకరాజు మాట్లాడుతూ నయా, చినఖేర్జల పంచాయతీలకు సంబంధించి 20 గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన కొమరాడ జూనియర్ కాలేజ్ సెంటర్ నుంచి ఆయా గ్రామాలకు వెళ్లడానికి రైల్వే అండర్ బ్రిడ్జిని ఆనుకొని రహదారి సౌకర్యం ఉందన్నారు. ఈ బ్రిడ్జి కింద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఆ గోతుల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేకమంది వాహనదారులు ఆ గోతుల్లో పడిపోయి తీవ్రగాయాలపాలవుతున్నారన్నారు. కావున వెంటనే ఈ అండర్ బ్రిడ్జి కింద నీటిని పూర్తి స్థాయిలో తొలగించాలని కోరారు. ఆ బ్రిడ్జి కింద ఉన్న చిన్న చిన్న గోతులను పూర్తిచేసి అటువైపు వెళ్తున్న 20 గిరిజన గ్రామాల ప్రజలకు అన్ని విధాలుగా భరోసా కల్పించాలని కోరారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న సిపిఐ ఎంఎల్ నాయకులు

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ధర్నా


ప్రజాశక్తి - పార్వతీపురం

మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ఆపార్డీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో ఇంతవరకు ఏడాదిలో 400 మంది మావోయిస్టులు మరణించారని చెప్పారు. చత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, సిపిఐ మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి ఎం.గోపాలం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, రైతు కూలీ సంఘం నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ పార్వతీపురం దిశగా పని చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్వచ్ఛ పార్వతీపురం దిశగా మీరంతా పనిచేయాలని ప్రజారోగ్య విభాగం అధికారి కె.పకీరురాజు మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో కార్మికులకు మస్తరు వేసే సమయంలో మున్సిపల్ పర్మినెంట్, ఔట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛ పార్వతీపురం దిశగా అందరూ పనిచేయాలని, విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా పనులు చేసుకొనే దిశగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ కెఫకీరు, రాజుతో పాటు, సచివాలయాల కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రజారోగ్యాధికారి పకీరురాజు

ప్రజల మనిషి..శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురం

కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి... ఈ పేరు పార్వతీపురంలోనే కాదు ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే పరిచయం అక్కర్లేని నాయకుడు. నిత్యం పెదాలపై చెరగని చిరునవ్వు. పేదలకు ఆప్యాయత, అనురాగాలు పంచడం ఆయన జీవన శైలి. ప్రజాఉద్యమాలతో పెనవేసుకుపోయిన నాయకుడాయన. గిరిజనోద్యమాల ఘనకీర్తి. ఆదివాసి హక్కుల రణనేత. గిరిజనుల పక్షాన నిలిచే జననేత. అటవీ హక్కుల సాధనలో నిరంతర శ్రామికుడు. తోటపల్లి నిర్వాసితుల ఉద్యమ రణధీరుడు. అనుక్షణం ప్రజల పక్షమై నిలిచిన నాయకుడు. రైతులు, వ్యవసాయ కార్మికుల పాలిట బాంధవుడు. ప్రజల మనసులు తెలుసుకున్న నిరంతర శ్రామికుడు. ఎన్నో సంఘాలకు సారధ్యం వహించారు. సిపిఎం పార్వతీపురం ప్రాంత కార్యదర్శిగా ఎదిగారు. ఎదిగిన కొద్దీ ఒదుగుతునే నిర్మాణ దక్షతలో సాటిలేని నాయకుడని పించుకున్నారు. లాఠీలు, తూటాలకు ఏనాడూ వెరవలేదు. ఉద్యమ ప్రస్థానంలో అక్రమకేసులు, అణిచివేత చర్యలు, నిర్బంధాలు, జైలు జీవితానికి వెనుకాడ లేదు. ప్రజాపోరాటాలను మరింతగా బలోపేతం చేస్తూ ఉద్యోమాలను ముందుకు నడపించడంలో రాటుదేలారు. ప్రజల మనిషిగా నిలిచారు. ఎందరికో ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శ్రీరామ్మూర్తి కరోనా మహమ్మారి బారిన పడి 2021 మే 3వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఈనేపథ్యంలో ఆయన నాలుగవ వర్ధంతి సభను శనివారం ఉదయం 10గంటలకు పార్వతీపురంఎన్‌జిఒ హోంలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు.



సీతానగరం మండలం రెడ్డివానివలసకు చెందిన శ్రీరామ్మూర్తి తొలినుంచీ జనంలో కలిసిపోయే తత్వం. బహుశా అందుకేనేమో యువతరంలో ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా యువజన సంఘాలు ఏర్పాటు చేయడం మొదలెట్టారు. అనంతరం రెండేళ్లలో ఎర్రజెండాకు ఆకర్షితుడైన ఆయన సుమారు 33ఏళ్ల క్రితం డివైఎఫ్‌ఐ సంఘంలో అడుగుపెట్టి వర్గపోరులో తుదిశ్వాస విడిచే వరకు పీడత ప్రజలపక్షాన నిలిచారు. అనతికాలంలోనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అవగతం చేసుకుని సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా చేరి ప్రజాసేవకు పునరంకితమయ్యారు. కన్నుమూసేంత వరకు మరో ఆలోచనే లేకుండా జీవితాన్ని పార్టీకి, ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారు. బోడికొండ, బడిదేవర కొండ, సిఖపరువు, తామర కొండ గ్రానైట్ తవ్వకాలు, రావివలస మెట్ట అక్రమ తవ్వకాల్లో వర్గ శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. భూ ఆక్రమణలు, రావివాలస కో - ఆపరేటివ్ సొసైటీలో బినామీ అప్పులు, గొట్టివలస భూములు ఇలా అదీ ఇదీ అని లేదు. ఎక్కడ ప్రజల సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యేవారు. గిరిజనోద్యమ పునర్నిర్మాణంలో శ్రీరామమూర్తి పాత్ర కీలకం. గిరిజనుల సమస్యలు, అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరలు, ఫారెస్ట్ అధికార్ల దాడుల నుండి గిరిజనుల రక్షణ, మావోయిస్టులకు సానుకూలంగా ఉన్నారని గిరిజనులపై పోలీసుల దాడుల నుండి రక్షణకు చేసిన పోరాటాలు, ఉద్యమాలకు సారధ్యం వహించారు. సవర విద్యావాలంటీర్ల సమస్య మొదలుకుని గిరిజన ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, అటవీ భూమికి పట్టాలు తదితరాలపై అలుపెరుగని పోరాటం చేశారు. తోటపల్లి బ్యారేజీ నిర్వాసితుల తరపున పోరాడి నిర్వాసితుల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. మెరుగైన నష్టపరిహారం, పునరావాసం సాధించుకోవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంతో ఉంది. చెరకు రైతుల ఉద్యమంలో యాజమాన్యం వెన్నులో వనుకు పెట్టించి రైతుల బకాయిలు ఇప్పించిన ఘనత శ్రీరామ్మూర్తిదే. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని పార్వతీపురం ప్రాంతంలో ముందువరుసలో ఉండి నడిపించారు. అంతిమ క్షణాల వరకు నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసం పనిచేసి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

నేడు రెడ్డి శ్రీరామ్మూర్తి వర్ధంతి సభ

సిపిఎం జిల్లా పూర్వకార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి 4వ వర్ధంతి సభ శనివారం ఉదయం పది గంటలకు స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించనున్నారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తితో పాటు జిల్లా నాయకులు పాల్గొనున్నారు. జిల్లాలో గల అన్ని మండలాల ముఖ్య నాయకులు హాజరు కావాలని జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు కోరారు.



సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు యూనియన్ నాయకులు తెలిపారు. కార్మికులు చేపట్టే సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ శుక్రవారం స్థానిక సిడిపిఒ విజయలక్ష్మికి సమ్మె నోటీసులు అందజేసిన అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల హక్కులను హరించేలా కొత్త కార్మిక చట్టాలను తీసుకొచ్చిందని, దీని ద్వారా కార్మిక లోకం తీవ్రమైన నష్టాలకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు చెందాల్సిన కనీస వేతనం రూ.26వేలు గ్రాడ్యుటీ, జీవో 8 రద్దు చేసి పిఎఫ్, పెన్షన్, ఇఎస్ఐ అమలు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తలను రెగ్యులర్ ఉద్యోగాలుగా గుర్తించాలని, మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, బాల సంజీవిని యాప్‌ను రద్దు చేయాలని, భారత ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, రైల్వేలు, ఉక్కు కర్మాగారాలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వరంగ సంస్థల్లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.శశికళ, వై.గౌరీశ్వరి, పుష్పలత, ఉత్తరమ్మ, అరుణ, సిఐటియు జిల్లా సహ కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణే ధ్యేయం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో మలేరియా నియంత్రణ లక్ష్యంగా కృషి చేయాలని, ఐఆర్ఎస్ పక్కాగా నిర్వహించాలాని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు జిల్లేడువలసలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేస్తున్న తీరును గమనించారు. ఇళ్లల్లో గల అన్ని గదుల్లోనూ పిచికారీ జరగాలన్నారు. ఐఆర్ఎస్ ఆవశ్యకతపై అక్కడ ప్రజలకు వివరించారు. ఐఆర్ఎస్ కు వినియోగమవుతున్న ఏసిఎం5% మోతాదుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్ప్రే చేస్తున్న సిబ్బంది మాస్క్,కళ్లజోళ్ళు,చేతి తొడుగులు తప్పక ధరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 915 గ్రామాల్లో ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 1 న ప్రారంభమైన మొదటి విడత ఐఆర్ఎస్ జూన్ 15 వరకు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీటితో పాటుగా సిబ్బంది డ్రైడే, ఫీవర్ సర్వే కార్యక్రమాలు పక్కాగా చేపడుతూ జిల్లాలో మలేరియా నియంత్రణకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన గోచెక్క గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులు పరిశీలించి ప్రతి రోజూ హెల్త్ వెల్నెస్ కేంద్రంలో ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తదుపరి డోకిశీల పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఒపి నమోదు, ఫార్మసీ రికార్డులు పరిశీలించారు. ఒఆర్ఎస్, మందుల నిల్వల లభ్యతను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, పిహెచ్‌సి వైద్యాధికారులు ఐశ్వర్య, కె.కౌశిక్, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ, ఎంటిఎస్ రామకృష్ణ, సూపర్వైజర్లు కృష్ణంరాజు, జయ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దారపాడు పంచాయతీలో కోసంగి, బూర్జగూడలో ఐఆర్ఎస్ ద్రావణం, మలాథియన్ స్ప్రేయింగ్ మొదటి విడత ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఒ పివి సత్యనారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి మాట్లాడుతూ 10 పిహెచ్‌సిల పరిధిలోని 212 మలేరియా ఐరిస్క్ గ్రామాలు గుర్తించామని, మొదట విడత ఈ గ్రామాల్లో స్ప్రేయింగ్ ఉంటుందని తెలిపారు. ప్రజల ఇంటి లోపల, బయట స్ప్రేయింగ్ చేసుకోవాలని కోరారు. దీనివల్ల మలేరియా తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, దోనుభాయి వైద్యాధికారి భానుప్రతాప్ పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన జనరేటర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల జనరేటర్ మరమ్మతులకు గురైంది. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు తమ విధులను చీకట్లోనే నిర్వహించడం గమనార్హం. రెండు రోజుల క్రితం జనరేటర్ మరమ్మతులకు గురైనప్పటికీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, మరమ్మతులు చేసేందుకు చొరవ చూపించకపోవడంతో కార్యాలయంలో పలు విభాగాల అధికారులు అసహనం వ్యక్తం చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు జనరేటర్ మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంకటబైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు విపత్తు నిర్వహణ బృందం గ్రామంలో డిజాస్టర్ మేనేజ్మెంట్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రకృతి వైపరీత్యాల్లో ఏ రకమైన జాగ్రత్తలు పాటించాలి, ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలి, అలాగే వరద ఉధృతి అయ్యేటప్పుడు ఎటువంటి చర్యలు చేపట్టాలి అన్న వాటిపై అవగాహన కల్పించారు. మండలానికి శివారులో ఉన్న కొత్తవలస చెక్ డ్యామ్ వద్ద నీటిలోని ప్రాక్టికల్ నిర్వహించారు. అనంతరం వెంకట బైరిపురం హైస్కూల్లో ఫైర్ బ్రిగేడియర్ పెట్టి ఆపరేషన్ ఎలా చేయాలి, భూకంపాలు వచ్చేటప్పుడు ఏ రకంగా ప్రజలను రక్షించాలని, గ్యాస్ సిలిండర్ మంటలను ఏ విధంగా అదుపు చేయాలనే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఇబ్రహీం, ఇఒపిఆర్‌డి దేవకుమార్, పిఒ పి.జగన్మోహన్, వైద్యాధికారి హరికృష్ణ, సిడిపిఒ అనంతలక్ష్మి, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతానగరం : ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సిఐ గోవిందరావు అన్నారు. మండలంలోని కొత్తవలసలో శుక్రవారం ప్రకతి విపత్తులైన భూకంపాలు, పెనుతుపాన్లు, వరదలు వచ్చేటప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు అవగాహన కల్పించారు. మెక్ రిలిహస్ పరికరాలు చూపించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు, రక్షించేందుకు, వీటి వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఇన్‌ఛార్జి ఎస్ఐ నీలకంఠం, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో 3 నెలల వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని అన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున 480 మంది నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. మరిన్ని వివరాల కొరకు 91772 97528 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీ పురంలో గల జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్, రిసెప్షనిస్ట్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాలకు 63034 93720 మొబైల్ నెంబరును సంప్రదించాలని అన్నారు. పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి సీతంపేట గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో శాంప్లింగ్ టైలర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 88976 77564 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సాలూరు నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐ.టి హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారని, ఇతర వివరాలకు 73825 59022 మొబైల్ నెంబరును సంప్రదించాలని అన్నారు. ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదోతరగతి అర్హత ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో కోరారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న 11మంది అరెస్టు

రూ.14.02 లక్షల నగదు, కారు, ల్యాప్ టాప్, 13మొబైల్స్ సీజ్

ప్రజాశక్తి-విజయనగరం, బొబ్బిలి

బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని శివరాంపురం గ్రామ శివార్లలోని మామిడి తోటలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ప్రధాన నిందితులతో సహా 11మందిని అరెస్టు చేసినట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

శివరాంపురం గ్రామ శివార్లలోగల మామిడితోటలో ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముసిడిపల్లి దివాకర్ బెట్టింగులతో నగదు సంపాదించాలనే లక్ష్యంతో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతూ, బెంగుళూరుకు చెందిన నిరంజన్ రెడ్డి నుంచి 'రాధే ఎక్చేంజ్' అనే బెట్టింగు యాప్ అడ్మిన్ తీసుకొని, యువతను ఆకర్షించేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో కమీషను ఇస్తూ ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క ఏజంటును నియమించుకున్నారు. ఏజంట్లుగా నియమించినబడిన వ్యక్తులంతా బెట్టింగు యాప్‌ను ప్రమోట్ చేస్తూ, యువతను ఆకర్షిస్తూ, వాట్సాప్ ద్వారా లింకులను షేర్ చేస్తూ, ఒక పథకం ప్రకారం బెట్టింగులకు పాల్పడుతున్నారు. బెట్టింగులకు మరింత విస్తతం చేయాలనే ఉద్దేశంతో ముసిడిపల్లి దివాకర్, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుండాల నవీన్, ఈదుబిల్లి సంతోష్ లతో కలసి నేషనల్ ఎక్చేంజ్ అనే మరో బెట్టింగు యాప్ అడ్మిన్ ఐడిని తీసుకున్నారు. ఈ యాప్‌లను సుమారు 200మంది యువకులు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో వినియోగిస్తూ, బెట్టింగులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనేపథ్యంలో దాడి చేసి 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముషిడిపల్లి దివాకర్ (అడ్మిన్), అంబటి రాంమోహన్ (అడ్మిన్), మహంతి గణేష్ (ఏజంట్), సామిరెడ్డి వాసు (ఏజంట్) కొట్టంగి మోహనరావు (ఏజంట్), మోడడ్ల పైడిరాజు (ఏజంట్), తాటి శంకరరావు (ఏజంట్), గేదెల శ్రీనివాస్ (యూజర్), సీరపు నారాయణరావు (యూజర్), తెర్లి మోహనరావు (యూజర్) ఉన్నారు. వీరి నుంచి రూ.14.02లక్షల నగదు, లెనోవ ల్యాప్ టాప్, ఒక కారు, 13 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిరంజన్ రెడ్డి (అడ్మిన్), ఈదురపల్లి సంతోష్ (అడ్మిన్), కార్తీక్ (అడ్మిన్), నవీన్ (అడ్మిన్) కోసం గాలిస్తున్నారు. ప్రధాన నిందితుడు అయిన ముసిడిపల్లి దివాకర్ ఏజంట్లుకు 3శాతం కమీషను ఇవ్వడంతోపాటు, పోగొట్టుకున్న వ్యక్తుల నగదులో 50శాతం సొమ్మును ఏజంట్లుకు ఇచ్చి.వారిని బెట్టింగు యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించేవాడని ఎస్‌పి తెలిపారు. ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లతో డబ్బులు సంపాదించడం సాధ్యం కాదని, యాప్ నిర్వాహకులు డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతోనే యాప్‌లను తయారు చేసి, యువతను ఆకర్షిస్తారని తెలిపారు.

క్రికెట్ బెట్టింగు ముఠాను గుట్టురట్టు చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, బొబ్బిలి ఎస్ఐ ఆర్.రమేష్, కానిస్టేబుళ్ళు ఎన్.సత్యనారాయణ, పి.సతీష్ కుమార్, కె.ఎర్రం నాయుడు, పి.అప్పారావులను ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన


ప్రజాశక్తి - కొమరాడ

బాల్య వివాహాల నివారణ, ఇతర సమస్యలపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా కొమరాడలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అనంతరం గంగరేగువలస ౧ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరాడ సిడిపిఒ జి.సుగుణ కుమారి మాట్లాడుతూ బాలికల కోసం మహిళా. శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహించే ఒక ప్రత్యేక కార్యక్రమం ఈనెల 2 నుండి జూన్ 10 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలకు, 11 నుంచి 14 ఏళ్ల వయస్సు గల డ్రాపౌట్ పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. బాలికల అభివృద్ధి, సాధికారతకు సహాయపడటం, బాల్య వివాహాల నివారణ, ఇతర సమస్యలపై అవగాహన కల్పించడం ఈ శిక్షణ ముఖ్యోద్దేశమన్నారు. అలాగే బాలికలకు విద్యా, పోషకాహార, ఆరోగ్య, సంరక్షణ అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. బాలికలకు సమాజంలో వారి స్థానాన్ని గుర్తించేలా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాల్య వివాహాలు, అత్యాచారం, బాలికలపై జరిగే హింస వంటి అంశాల గురించి అవగాహన, విద్యా, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యత, పౌష్టికాహారం, ఐరన్ లోపం, ఇతర ఆరోగ్య సమస్యల గురించి ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపుల గురించి అవగాహన, యోగా, ఫిట్‌నెస్, ఇతర శారీరక వ్యాయామాల ద్వారా ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

లారీ డ్రైవర్ అజాగ్రత్తతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరఖండి సమీపాన ఇటుక బట్టీకి లారీ మధ్యలో ఇరుక్కుపోవడం జి.సత్యం (55) మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం గజపతినగరం మండలం పెదకాదకు జి.సత్యం, తవుడమ్మ గత మూడేళ్ళ తన అల్లుడు సీతానగరం కుమ్మరివీధికి చెందిన కె.సతీష్ ఇంటికి వచ్చేశారు. వీరు తామరఖండిలోని ఇటుక బట్టీల్లో పనులు చేసుకుంటూ ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఇటుక తయారీ కోసం వచ్చిన బూడిద లారీ బట్టి పక్కన ఉన్న సత్యం చూడకుండా లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపపడడంతో బట్టీకి, లారీ మధ్య ఇరుక్కుపోయి స్పృహ కోల్పోయాడు. వెంటనే పార్వతీపురం అస్పత్రికు తరలించారు. వైద్యులు పరిశీలించిగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య తవుడమ్మ ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ లంక శ్రీనువాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



22 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా అమ్మకాలపై దాడులు జరిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ చినమేరంగికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారా అమ్ముతుండగా 22 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా సారా తయారు చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.